సాక్షి
ఒడిశా
శనివారం । 2 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,29,142లు, బంగారం 1 గ్రాము 650 మిల్లీగ్రాము, వెండి 4గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రిజర్వాయర్ సందర్శన

చెలిగడ రిజర్వాయర్‌ను అధికారులు సందర్శించారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

- 8లో



అంకితభావంతో సేవ..

అంకితభావంతో సేవ చేయాలని గవర్నర్ ఆదేశించారు. ఓఆర్ఎస్ అధికారులతో ఆయన మాట్లాడారు.

- 8లో

మంత్రి మండలి విస్తరణపై ఉత్కంఠ

- మహామహుల భేటీ
- తెర వెనక వ్యూహాలు

భువనేశ్వర్:

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఏడాది పాలన పూర్తి చేసుకుంది. ఈ విజయోత్సవం వెంబడి మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందని భావించారు. ఈ మేరకు ఇంత వరకు ఎలాంటి చర్యలు స్పష్టం కాలేదు. దీంతో ఆశావహుల్లో ఉత్కంఠ బిగుసుకుంది. మంత్రి మండలిలో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ కంటే కొంత మంది సిట్టింగుల తొలగింపు, మరి కొంత మందికి శాఖల మార్పు, ఇంకొంత మందికి బహుళ శాఖల బాధ్యతల నుంచి ఉపశమనం దిశలో కొత్త మంత్రి వర్గం విస్తరణ రూపు రేఖలు దిద్దుకుంటుందనే ఊహాగానాలు బలంగా షికారు చేస్తున్నాయి. ఈ క్రమంలో ఖాళీ మంత్రి పదవుల భర్తీతో మార్పు చేర్పులకు అనుగుణంగా కొత్త ముఖాల ఎంపిక కసరత్తులో పార్టీ అధిష్టానం తలమునకలై ఉంది. రాష్ట్రంలో తొలి సారిగా మంత్రి మండలి విస్తరణలో గవర్నర్ ప్రధాన సూత్రధారిగా వ్యవహరించే సంకేతాలు తారసపడుతున్నాయి. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం పథకాల అమలు, కార్యాచరణ వంటి వ్యవహారాల్లో ప్రత్యక్షంగా చొరవ కల్పించుకుని క్షేత్ర స్థాయిలో సందర్శనలో చురుగ్గా పాలుపంచుకున్నారు. తదనంతరం పలువురు మంత్రులతో ముఖాముఖి సంప్రదింపులు విభిన్న శైలిలో కొనసాగాయి. కొంత మంది మంత్రుల ఇళ్లకు వెళ్లి గవర్నర్ కలిశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, న్యాయ శాఖ మంత్రి తదితర కీలకమైన వారు ఉన్నారు. రాష్ట్రంలో ఈ సంప్రదింపులు ముగిసిన తర్వాత గవర్నర్ న్యూ ఢిల్లీ కూడా



గవర్నర్‌తో ముఖ్యమంత్రి సమావేశం

సందర్శించారు. ఆ సందర్భంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వంటి వ్యూహకర్తలతో గవర్నర్ భేటీ అయ్యారు. మరో వైపు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు తదితర ప్రముఖులు ఢిల్లీ పర్యటించి రోజుల తరబడి డేరా వేసి పలువురితో సంప్రదింపులు, సమావేశాలు జరిపారు. ఢిల్లీ, భువనేశ్వర్‌లో జరిగిన ఉన్నత స్థాయి బీజేపీ సమావేశాల మధ్య రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. పనిలో పనిగా దీర్ఘకాలంగా ఖాళీ అయిన కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు తదితర స్థాయిలో చైర్మన్ వంటి ప్రముఖ పదవుల భర్తీ పూర్తి కానుంది. ఈ మేరకు ఉన్నత స్థాయి సంప్రదింపులు, సమావేశాల్లో అభ్యర్థుల ప్రాథమిక జాబితా సిద్ధం అయి ఉంటుందనే ఆశావాదం కొనసాగుతుంది. రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి ఇటు రాష్ట్రంలో అటు ఢిల్లీలో మంత్రులు, పార్టీ ప్రముఖులతో ప్రత్యక్షంగా సమావేశం కావడంతో రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రతిష్టాత్మక సాహితీ, సాంస్కృతిక, సామాజిక వర్గాలతో సమావేశం కావడం రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే గవర్నర్ పర్యటనలు, సందర్శనలు, సమావేశాలు అధికారికంగా రాష్ట్ర వ్యవహారాలతో ముడిపడి లేనప్పటికీ రాష్ట్రంలో నెలకొని ఉన్న వర్ధమాన పరిస్థితుల నేపథ్యంలో గవర్నర్ ప్రత్యేక చురుకుదనం అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. గత నెల 21న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. అనంతరం, గవర్నర్ న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్‌తో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఆ తర్వాత రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారిని రాజ్ భవన్‌లో కలిశారు. ఇదంతా పూర్తి కావడంతో న్యూ ఢిల్లీ వెళ్లి రాష్ట్ర రాజకీయాల్లో ఆరి తేరి భారతీయ జనతా పార్టీ దృష్టిలో పటిష్టమైన వ్యూహకర్తగా వెలుగొందుతున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయ్యారు. ఈ సమగ్ర సమావేశాల్లో రాష్ట్రంలో సుపరిపాలన, సమగ్ర అభివృద్ధి దిశలో



గవర్నర్‌ని స్వాగతించిన న్యాయ శాఖ మంత్రి కుటుంబ సభ్యులు

చర్చలు సాగినట్లు మాత్రమే స్పష్టం అయింది. రాజకీయపరమైన చర్చలు, సంప్రదింపులకు సంబంధించి గోప్యత కొనసాగుతుంది. పశ్చిమ ఒడిశా నుంచి భారతీయ జనతా పార్టీలో రాజకీయ దక్షత కలిగిన రాజ వంశీకుడు, ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ ఢిల్లీలో పర్యటించి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థ) బి. ఎల్. సంతోష్‌ను కలిశారు. ఈ కలయిక రాజకీయ ప్రాధాన్యతతో ముడిపడిందిగా చర్చ కొనసాగుతుంది. రాష్ట్ర రాజధానిలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ విజయ్‌పాల్ సింగ్ తోమర్, వంటి ప్రముఖులతో గోప్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొత్తం మీద రాష్ట్రంలో అత్యంత బలమైన మంత్రి మండలి తెరపైకి రానుందని ఊహిస్తున్నారు. మంత్రి మండలి విస్తరణ రేపో మాపో అన్న దశకు చేరుకుంది. ఈ సమయంలో మంత్రి పదవుల కోసం ఎమ్మెల్యేలు ఎవరి తరహాలో వారు తమ ఉనికిని రాజకీయంగా ప్రతిబింబించే ప్రయత్నంలో మునిగి తేలుతున్నారు. అటు ముఖ్యమంత్రితో ఇటు పార్టీ, ప్రభుత్వంలో పరపతి కలిగిన నాయకులతో ఆశావాదులు దక్షత, సమర్థత ప్రదర్శనకు పదును పెడుతున్నారు. పదవుల్ని కాపాడుకోవడంలో పలువురు సిట్టింగులు తల్లడిల్లుతున్నారు. రాష్ట్రంలో ఇటీవల వరుసగా చోటు చేసుకున్న సంఘటనలు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, పట్టణ అభివృద్ధి, గృహ నిర్మాణం, పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమం, గిరిజన సంక్షేమం, వాణిజ్య, రవాణా, పాఠశాలలు, సామూహిక, ఉన్నత విద్యా విభాగాల పని తీరు ప్రజల ఆశల్ని నీరు గార్చినట్లు విమర్శలు బలం పుంజుకుంటున్నాయి. రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం పాలన కొనసాగుతుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బలపరచిన విశ్వాసం తాజా సంఘటనలతో పూర్తిగా నీరు గారి పోయింది. మంత్రి వర్గ విస్తరణ పురస్కరించుకుని పాలనలో భారీ సంస్కరణ దిశలో కొత్త ముఖాలకు పట్టం గట్టే అవకాశంపై విశ్లేషకులు గురి పెట్టారు.



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కలిసిన రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటి



రాజ్ భవన్‌లో గవర్నర్‌ని కలిసిన రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి



బీజేపీ జాతీయ సంస్థాగత కార్యదర్శితో ఉప ముఖ్యమంత్రి భేటీ



ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ ఇంటిలో గవర్నర్ సంభాషణ

న్యూస్‌రీల్

ఆర్ఎస్ఎస్ కార్యకర్తల శ్రమదానం



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

రాయగడ: జిల్లాలోని గుడారి గ్రామంలో ఉన్న కన్యకాపరమేశ్వరీ ఆలయ పరిసరాలను ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు శ్రమదానం ద్వారా శుక్రవారం శుభ్రం చేశారు. అలాగే కొత్త బస్టాండ్, తదితర ప్రాంతాల్లో సఫాయి కార్యక్రమాలను చేపట్టారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఎస్.తిరుమల సింహాద్రి, కిరణ్ దొయ నంద, బి.తిరుమల, క్రిష్ణచంద్ర సాహు, దివ్యసింగ్ పాత్రో, బి.ఆదిత్య తదితరులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మంగు ఖీలో విస్తృత పర్యటన



గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మంగు ఖీలో

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి బొడ్డదొరాల్ పంచాయతీలో చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఈ పంచాయతీలోని పలువురు ఇళ్లు కోల్పోయారు. దీంతో వారిని పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇళ్లు కోల్పోయినవారికి ఇళ్లు ఇప్పిస్తామని తెలియజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కైలాస్‌పూర్ వద్ద రోడ్డు ప్రమాదం



నుజ్జునుజ్జయిన ఒమినీ వాహనం ముందరి భాగం

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి కైలాస్‌పూర్ ఘాటి మలుపులో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు గురువారం సాయంత్రం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ముకుందపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఒమినీ వాహనంలో ఒక వ్యాపారి ముకుందపూర్ నుంచి జేకేపూర్ వైపు వస్తుండగా, ఘాటి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఒక కారును అదుపుతప్పి ఢీకొంది. దీంతో కారు, ఒమినీ ముందు భాగాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు, అదేవిధంగా ఒమినీ వాహనాన్ని నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న సంఘం సభ్యులు

జయపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రైవేట్ బస్సు యాజమాన్య సంఘం సభ్యులు పేర్కొన్నారు. స్థానిక ప్రైవేటు బస్టాండ్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి నరేంద్ర కుమార్ మహంతి మాట్లాడుతూ.. బస్టాండ్‌లో కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటేందుకు నిర్ణయించామన్నారు. చెట్లు ఉంటే అవి వివిధ రకాల పక్షులకు ఆవాసాలుగా ఉంటాయని పేర్కొన్నారు. బస్టాండ్ ప్రాంగణం అంతటా పరిశుభ్రం చేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని పిలుపునిచ్చారు.

బిసంకటక్ పోలీస్‌స్టేషన్ ఘెరావ్



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రాయగడ: ఒక హత్య కేసుకు సంబంధించి బిసంకటక్ పోలీసులు కేసు దర్యాప్తును నీరు గారుస్తున్నారని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌ను ఘెరావ్ చేశారు. వందలాది ఆదివాసీ మహిళలు, యువకులు ఈ ఘెరావ్‌లో పాల్గొన్నారు. దీంతో రెండు గంటల సమయం పోలీస్ స్టేషన్ మెయిన్ గేటు వద్ద తమ నిరసనను వ్యక్తం చేశారు. జిల్లాలోని బిసంకటక్ సమితి పరిధిలోని డుమురినాలా పంచాయతీలో గల లుటుగుడ గ్రామానికి చెందిన పింటు కిలక (21) అనే ఆదివాసీ యువకుడు జూన్ 27న సమితి పరిధిలో గల దుర్గిలో జరిగే రథయాత్రను చూసేందుకు వెళ్లాడు. యాత్రను చూసేందుకు వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతకడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల తర్వాత దుర్గీ సమీపంలో గల ఒక అడవిలో యువకుని మృతదేహం ఒక చెట్టుకు వేలాడుతూ కనిపించింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు బాధిత కుటుంబీకులకు సమాచారం అందించారు. అయితే ఇది ఆత్మహత్య కాదని హత్య చేసి ఎవరో ఇలా ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తు బాధిత కుటుంబీకులు బిసంకటక్‌లా ఫిర్యాదు చేశారు. కేసు నమోదై నెల రోజులు కావస్తున్నా పోలీసులు ఇంతవరకు హత్యకు సంబంధించిన వారిని పట్టుకోలేదని బాధిత కుటుంబీకులు ,గ్రామస్తులు ఆరొపిస్తు ఈ ఆందోళనకు దిగారు.



మృతుని ఫొటోలతో ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



భీమా సోడి మృతదేహన్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



భీమాసోడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: పోలం పనులు చేస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి తేల్‌రాయి పంచాయతీ సుద్ధాకొండ గ్రామంలో శుక్రవారం చోటచేసుకోగా భీమా సోడి (42) మృతి చెందాడు. సుద్దాకొండ గ్రామానికి చెందిద భీమా సోడి తన పొలంలో వ్యవసాయం పనులు చేయించేందుకు ఎంపీవీ-77 గ్రామానికి చెందిన వివేకవైద్య అనే యువకుడుని ట్రాక్టర్ డ్రైవర్‌గా పిలిచి పని చేయిస్తున్నారు. అయితే ట్రాక్టర్ టైరు మట్టిలో కూరుకుపోవడంతో దాన్ని బయటకు తీసేందుకు వివేక్ స్పీడ్ రేజ్ చేశాడు. దానితో ట్రాక్టర్ బోల్తా పడి పక్కనే ఉన్న భీమాసోడిపై పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని రోదించారు. సమాచారం తెలుసుకున్న కలిమెల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐఐసీ ముకుంద్ మేశ్క.. భీమా సోడి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వ్యక్తిపై దుండగుడి దాడి

రాయగడ: స్థానిక సినిమా హాల్ ప్రాంగణంలో గురువారం రాత్రి ఒక వ్యక్తిపై దుండగుడు దాడికి దిగాడు. ఈ ఘటనలో ఒకరు తీవ్రగాయాలకు గుర్త్రె స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతడు రామకృష్ణ నగర్‌కు చెందిన జాకబ్ రాజ్ (22)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాకబ్ అనే వ్యక్తి సినిమా చూసి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో సినిమా హాల్ ప్రాంగణంలో కాపు కాసి ఉన్న మరోవ్యక్తి అతనిపై దాడికి దిగాడు. కేసు నమోదు చేసిన పోలీసులు జాకబ్‌పై దాడి చేసిన వ్యక్తి గురించి గాలిస్తున్నార

కొటియాలో కలెక్టర్ పర్యటన

జయపురం: కొరాపుట్ జిల్లా నూతన కలెక్టర్ మనోజ్ సత్యాన్ మహాజన్ గురువారం కొటియ పంచాయతీ గ్రామాలను సందర్శించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపైన, చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలపైన ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తాము పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొటియా సర్పంచ్ నియ గమేల్, తుడా ప్రాజెక్ట్ డైరెక్టర్ బేణుధర శబర, కొరాపుట్ సబ్ కలెక్టర్ ప్రేమలాల్ హియాల్, బీడీఓ రామకృష్ణ నాయిక్, తహసీల్దార్ దేవేంద్ర దారువ, ఏఈ విశ్వనాథ్ మాదెలి, కొటియ పంచాయితీ ఇంజినీర్ జయరాం తొరాయి, ఏపీఓ సొమేంద్ర నాయిక్, కొటియ రూరల్ వాటర్ వర్క్స్ అండ్ శానిటేషన్ విభాగ అధికార ఇంజినీర్ బాసుదేవ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



కొటియాలో పర్యటిస్తున్న కలెక్టర్ తదితర అధికారులు

భక్తి శ్రద్ధలతో శ్రావణ పూజలు



రాయగడ: లక్ష కుంకుమ పూజల్లో మహిళలు



రాయగడ: ప్రత్యేక అలంకరణలో కస్తూరీనగర్‌లోని లక్ష్మీ అమ్మవారు

రాయగడ: శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక కస్తూరీనగర్‌లోని సత్యనారాయణ ఆలయంలో కొలువై ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం రఘునాయకుల శర్మ, కిశోర్‌శర్మ, వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన పూజలు జరగ్గా అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సుప్రభాత సేవ, అభిషేక కార్యక్రమాలు జరిగాయి.

కోదండ రామ మందిరంలో..

స్థానిక బ్రాహ్మణ వీధిలోని కోదండరామ మందిరంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు అనంత ఆచార్యుల ఆధ్వర్యంలో లక్ష కుంకుమ పూజలు జరిగాయి. పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాములకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఘనంగా శ్రావణశుక్ర వరలక్ష్మీ వ్రతాలు.

పర్లాకిమిడి: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక రాజవీధి పొడుగు కోవెలలో వరలక్ష్మీ పూజలను ప్రధాన అర్చకులు దుర్గాబాబు ఆధ్వర్యంలో ముత్తయిదవులతో చేయించారు. అలాగే పెట్రోల్ బంకు రోడ్డు, వాసవీ కన్య కాపరమేశ్వరీ ఆలయంలో శ్రావణ వరలక్ష్మి వ్రతాలను అర్చకులు వనమాలి మణిశర్మ ఆధ్వర్యంలో సామూహికంగా చేయించారు. కేవుటి వీధి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా వరలక్ష్మి వ్రతాలు ప్రధాన పూజారి ఎ.రాజగోపాలచారి ఆధ్వర్యంలో జరిగాయి.



పర్లాకిమిడి: ముత్తయిదవులకు కుంకుమ పెడుతున్న మహిళలు



పర్లాకిమిడి: శ్రీలలితాదేవి మందిరంలో వరలక్ష్మీ పూజలు



రాయగడ: కోదండరామ మందిరంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



పర్లాకిమిడి: ఉమారామలింగేశ్వర ఆలయంలో సామూహిక వ్రతాలు

చెలిగడ రిజర్వాయర్ సందర్శన

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్ చెలిగడ జలవిద్యుత్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ మధుమిత శుక్రవారం అధికారులతో సందర్శించారు. తొలుత కలెక్టర్ మధుమిత కువాపడ, ముషాడోల్లి గ్రామానికి వెళ్లి ఛెలిగడ రిజర్వాయర్ ప్రాజెక్టు అంతర్గత నిర్మాణాలు, టన్నెల్‌ను సందర్శించారు. అనంతరం చెలిగడ గ్రామంలో ఎడమవైపు నిర్మాణంలో ఉన్న డ్యాం, బోడోజోరో నదిని సందర్శించారు. తర్వాత ఛెలిగడ రిజర్వాయర్ వల్ల ముంపునకు గురైన పులుసుగుబ్బ నిర్వాసితుల కాలనీని పరిశీలించి వాటి పనులు వెంటనే పూర్తిచేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. పులుసుగుబ్బ వద్ద నిర్వాసితుల కాలనీ వద్ద ప్రభుత్వ పాఠశాల, తాగునీరు, విద్యుత్ సౌకర్యంపై అధికారులతో అక్కడ సమీక్షించారు. కలెక్టర్ మధుమిత పర్యటనలో చెలిగడ రిజార్వ్యాయర్‌కు భూసేకరణ, పునరావాస అధికారి రవీంద్ర నాథ్ కుహోరో, ఛెలిగడ జలవిద్యుత్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీరు బీరేంద్ర కుమార్ జగత్, ఆర్.ఉదయగిరి తహసీల్దార్ జ్యోతిమయ దాస్, మండల అధికారి శుభాషిష్ పండా, లోకనాథ బెహరా, ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు లక్ష్మీ చరణ్ మిశ్రా, ఏఈ జయంత్ నాయక్, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం చెలిగడ గ్రామం వద్ద నిర్వాసిత కుటుంబ ప్రజలతో కలెక్టర్ మధుమిత మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెలిగడ రిజర్వాయర్‌ను వీలైనంత తొందరలో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



ఆర్.ఉదయగిరి బ్లాక్ చెలిగడ జలవిద్యుత్ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ మధుమిత



ఛెలిగడ జలవిద్యుత్ రిజర్వాయర్ ప్రాజెక్టును చూస్తున్న కలెక్టర్ మధుమిత

అంకితభావంతో సేవ చేయండి: గవర్నర్



ఓఆర్ఎస్ శిక్షణార్థులతో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: యువ అధికారులుగా ప్రభుత్వ నియమాలు, ఫైళ్లకు పరిమితం కాకుండా ప్రజా సంక్షేమం వాస్తవ కార్యాచరణగా ఉన్నత సామాజిక జీవన ఆవిష్కర్తలుగా వెలుగొందాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి తెలిపారు. శుక్రవారం రాజ్‌భవన్ ప్రాంగణం న్యూ అభిషేక్ హాల్‌లో 2022 బ్యాచ్‌కు చెందిన 83 మంది శిక్షణార్థి ఒడిశా రెవెన్యూ సర్వీస్ (ఓఆర్ఎస్) అధికారులతో గవర్నర్ ప్రత్యక్షంగా సంభాషించారు. కార్యక్రమంలో గవర్నర్ కమిషనర్ రూపా రోషన్ సాహు పాల్గొన్నారు. ప్రభుత్వ పాలన వ్యవస్థలో అత్యంత కీలకమైన పాత్రధారులు రెవెన్యూ సర్వీస్ అధికారులుగా పేర్కొన్నారు. వీరి సేవలు ప్రజల జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయి. నిజాయితీ, అంకిత భావంతో ప్రజలకు సేవ చేయడంలో అధికారులు తమ బాధ్యతలను ప్రతిబింబించాలని కోరారు. భూముల సంబంధిత రికార్డుల నిర్వహణ, వివాద పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు రెవెన్యూ అధికారుల కీలక బాధ్యతలుగా గవర్నర్ వివరించారు. సంక్షేమ పథకాల్లో అర్హులైన పౌరులను నమోదు చేయడంలో ఓఆర్ఎస్ అధికారుల చురుకైన పాత్ర ప్రజల విశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు.

క్లుప్తంగా

మహిళను వేధించిన ముగ్గురు అరెస్టు

జయపురం: ఒక మహిళను శారీరకంగా, మానసికంగా వేధించిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు జయపురం మహిళా పోలీసులు శుక్రవారం వెల్లడించారు. జయపురం సమితి ధనపూర్ పంచాయతీ బొడొకావిడికి చెందిన లావణ్య నాగ్ తనను భర్త, అత్త మరిదిలు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల వివరణ ప్రకారం రెండేళ్ల కిందట లావణ్యకు, రాజా సాగరియతో వివాహం జరిగింది. ఏడాది పాటు వారు బాగానే ఉన్నారు. తర్వాత అత్తింటి వారు ప్రతి విషయానికి తిడుతూ కొడుతూ ఉన్నారని, ఆ వేధింపులు భరించలేక జయపురం ప్రసాద రావు పేటలో ప్రాంతంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని లావణ్య ఉంటున్నారు. అక్కడకు కూడా వచ్చి కొడుతున్నట్లు ఫిర్యాదులో ఆరోపించింది. గత నెల 28వ తేదీన ఆమె మరిది ఇంటికి వచ్చి తిడుతూ ఆమె నుంచి బిడ్డను బలవంతంగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాడని, ప్రతిఘటించటంతో కొట్టి బెదిరించి వెళ్లాడని ఆమె ఫిర్యాదు చేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు. తనకు ప్రాణాపాయం ఉందని తనకు రక్షణ కల్పించాలని ఆమె ఫిర్యాదులో కోరింది. కేసు నమోదు చేసి ఏఎస్ఐ బికాశ చంద్ర నాయిక్ దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ సోమేశ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జర్నలిస్టులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సోమేశ్ కుమార్ ఉపాధ్యాయ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా విలేకరుల సంఘం ప్రతినిధులు నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

డాక్టర్ల కొరత తీర్చాలని కాంగ్రెస్ డిమాండ్



ఆదనపు డీపీహెచ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సుసిబ్బంది కొరత వల్ల చుట్టుప్రక్కల నుండి వస్తున్న రోగులకు సేవలు అందటం లేదని ఎమ్మెల్యే మోహనా ప్రతినిధి ఈశ్వర చంద్ర మఝి, మాజీ వైస్ చైర్మన్ సంజయ్ అధికారి, అశోక్ అధికారులు తెలియజేశారు. శుక్రవారం ఆదనపు వైద్యాధికారికి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. నెలరోజుల లోపు హెడ్‌క్వార్టర్ ఆసుపత్రిలో డాక్టర్లు నియామకం చేపట్టకుంటే ఆసుపత్రి వద్ద ధర్నా ఆందోళన చేపడతామని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జాస్మిన్ షేక్ అన్నారు.

దాడి ఘటనలో నిందితుడి అరెస్టు

జయపురం: జయపురం సమితి పాత్రోపుట్ పెట్రోల్ బంక్‌లో పనిచేసే రాజేంద్రఖిల్లోపై కత్తితో దాడి చేసి గొంతు కోసి హత్య చేయటానికి ప్రయత్నించిన దుండగులు పరారైన విషయం విదితమే. పరారీలో దుండగులలో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి సచిన్ ప్రధాన్ నేడు వెల్లడించారు. అదుపులోనికి తీసుకోబడిన వ్యక్తి జయపురం సమితి ఉమ్మిరి గ్రామస్తుడని తెలిపారు. అతడి వద్ద రాజేంద్రపై దాడికి వినియోగించిన ఆటోను సీజ్ చేసినట్లు ప్రధాన్ వెల్లడించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

టెక్కలి రూరల్: స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, రెండు రోజులుగా టెక్కలిలోనే తిరిగాడని స్థానికులు చెబుతున్నారు. గురువారం రాత్రి సమీప షాపుల బయట పడుకుని ఉదయం వెళ్లిపోయాడని, మధ్యాహ్నానికి మృతి చెంది కనిపించాడని అంటున్నారు. మృతుడు నీలం టీషర్టు, ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ రాము కోరారు.

రెడ్డీస్‌లో బ్యాటరీలు చోరీ

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ సీటీవో-6 పరిశ్రమలో గత నెల 23న నాలుగు పెద్ద బ్యాటరీలు చోరీ జరిగినట్లు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.చిరంజీవి శుక్రవారం చెప్పారు.

త్వరలో రత్న భాండాగారానికి జగన్నాథుని ఆభరణాలు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని ఆభరణాలు భద్రపరిచే రత్న భాండాగారం లోపల, వెలుపలి భాగాల మరమ్మతు, నిర్వహణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. భారత పురావస్తు శాఖ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పనులు ముగించారు. తదుపరి చర్యగా స్వామి నగలు, ఆభరణాలు, పాత్రలు వంటి అమూల్య సంపదని యథాతథంగా రత్న భాండాగారానికి తరలించాల్సి ఉంది. ఈ మేరకు అనుబంధ కార్యాచరణ ఆరంభమైంది.

ఆర్‌బీఐ నిపుణుల నియామకం

రత్న భాండాగారంలో భద్రపరిచిన సొత్తు లెక్కింపు, అనుబంధ జాబితా అత్యంత కీలకం. క్రమ పద్ధతిలో ఈ బృహత్తర ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు శ్రీమందిర్ రత్న భాండాగారంలో ఆభరణాలు, నగలు జాబితా తయారీ కోసం భారతీయ రిజర్వ్ బ్యాంకు ఇద్దరు నిపుణులను పేర్కొంది. ఈ నిపుణుల పర్యవేక్షణలో మందిరం అధికార వర్గాలు రత్న భాండాగారంలో భద్రపరచాల్సిన నగలు, ఆభరణాలు వగైరా వివరాల్ని ప్రత్యక్షంగా పరిశీలించి భావి కార్యాచరణ కోసం పటిష్టమైన నమోదు, భద్రతా వ్యవస్థని పర్యవేక్షిస్తాయి. గత కొద్ది కాలంగా శ్రీ మందిరం పాలక వర్గం కాలపరిమితి ముగియడంతో కొత్త వర్గం నియామకం కోసం నిరీక్షిస్తున్నారు. పాలక మండలి ఏర్పాటు రత్న భాండాగారానికి నగలు, ఆభరణాల తరలింపు, భద్రత వగైరా ముఖ్యమైన కార్యకలాపాలు ముందుకు సాగుతాయి. త్వరలో శ్రీ మందిరం కొత్త పాలక వర్గం సిద్ధం అవుతుంది. ఈ మేరకు ప్రాథమిక ప్రతిపాదనలు తదితర వ్యవహారాలు పూర్తి అయి తుది మెరుగులు దిద్దుకుంటున్నట్లు రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. కొత్త పాలక మండలి ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథుని నగలు, ఆభరణాలు భద్రంగా లోపలి రత్న భాండాగారానికి బదిలీ చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రక్రియ కోసం మరో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటవుతుంది. ఇదంతా ముగియడంతో స్వామి నగలు, ఆభరణాలు తదితర అమూల్య సంపద రత్న భాండాగారానికి తరలించేందుకు తేదీ ఖరారు అవుతుంది. ఆ ప్రకారం భారతీయ రిజర్వు బ్యాంకు పేర్కొన్న సభ్యుల సమక్షంలో ఆభరణాలు, నగలు జాబితాను రూపొందించి చిట్టచివరగా రత్న భాండాగారంలో భద్రపరచడం జరుగుతుందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు.

రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు



టీషర్టులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 3న జిల్లా యోగాసనా చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివేకానంద ధ్యాన యోగా సమితి అధ్యక్షుడు కింజరాపు రామారావు తెలిపారు. యోగాసన స్పోర్ట్ అసోషియేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. దీనిలో భాగంగా అభ్యాసకులకు ఇచ్చే టీషర్టులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ , ఎస్‌వైఎస్‌ఎఫ్ కార్యదర్శి బోత్స కేదారినాథ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 7 కల్లా సభా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు.

బాక్సర్‌కు అభినందనలు



యువ బాక్సర్ సత్యభార్గవ్‌తో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, కోచ్ ఉమా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన యువ బాక్సింగ్ సంచలనం జి.సత్యభార్గవ్‌ను డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు అభినందించారు. శుక్రవారం కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద శిక్షణకు హాజరైన సత్యభార్గవ్‌ను, తీర్చిదిద్దుతున్న కోచ్ పి.ఉమామహేశ్వరరావును మెచ్చుకున్నారు. హర్యానాలోని రోతక్ వేదికగా జరిగిన ఆలిండియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈ యువ బాక్సర్ రజత పతకంతో మెరిసిన విషయం తెలిసిందే. దీంతో ఇండియన్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. త్వరలో శిక్షణా శిబిరాలకు హాజరుకానున్నట్లు కోచ్ తెలిపారు.

ఒడియా సినిమాకు జాతీయ అవార్డు



పుష్కర ఉత్తమ ఒడియా చిత్రం



ది సీ - ది సెవెన్ విలేజెస్ ప్రత్యేక ప్రస్తావన లఘు చిత్రం

భువనేశ్వర్: జాతీయ చలనచిత్ర అవార్డులు-2023లో పుష్కర ఉత్తమ ఒడియా చిత్రంగా గెలుపొందింది. నాన్-ఫీచర్ ప్రత్యేక ప్రస్తావన (స్పెషల్ మెన్షన్) లఘుచిత్రంగా ది సీ - ది సెవెన్ విలేజెస్ ప్రత్యేక గుర్తింపు పొందింది. శుభ్రాంషు దాస్ దర్శకత్వం వహించిన 'పుష్కర' ఒడియా చలన చిత్రంలో సబ్యసాచి మిశ్రా ప్రముఖ పాత్ర పోషించారు. ఈ చిత్రం శంకర్ త్రిపాఠి రచన ఒడియా నవల 'నాదబిందు' ఆధారంగా నిర్మించారు. అనేక చలనచిత్రోత్సవాలలో పుష్కర విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం జాతీయ వేదికపై అత్యున్నత గౌరవాన్ని అందుకుంది. పుష్కర' గ్రామీణ ఒడిశాలోని సంప్రదాయం, సామాజిక పరివర్తన ఇతివృత్తాలతో చిత్రీకరించారు. హిమాంషు ఖటువా దర్శకత్వం వహించిన ది సీ - ది సెవెన్ విలేజెస్ లఘు చిత్రం ఒడిశాలోని సాతొభయ్యా తీరప్రాంత స్థానభ్రంశంతో సమాజాల భావోద్వేగ, సామాజిక, పర్యావరణ పరిణామాల్ని సమగ్రంగా చిత్రీకరించింది. ఈ చిత్రం వాతావరణ మార్పు, సముద్ర మట్టాలు పెరగడం, ఈ ప్రాంతంలోని తరతరాలుగా కుటుంబాలను ప్రభావితం చేస్తున్న పూర్వీకుల గృహాల నష్టం వాస్తవాల్ని తెరకి ఎక్కించింది. 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో 'పుష్కర' ఉత్తమ ఒడియా చిత్రంగా అవార్డును గెలుచుకుంది. 'ది సీ అండ్ సెవెన్ విలేజెస్' నాన్-ఫీచర్ విభాగంలో ఉత్తమ ఒడియా చిత్రంగా అవార్డును పొందింది. ఈ సందర్భంగా ఈ రెండు చిత్రాల నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక ఇతర వర్గాల్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందించారు. ఒడియా చలన చిత్ర రంగం మరిన్ని మంచి చిత్రాలతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

గవర్నర్‌ను కలిసిన మిజోరం మంత్రి



మిజోరం ప్రభుత్వ ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, భూమి, రెవెన్యూ, పరిష్కార శాఖల ఇన్‌చార్జి మంత్రి బి. లాల్‌చంజోవా శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటిని కలిశారు. ఈ సందర్భంగా పరస్పర ఆసక్తి ఉన్న అంశాలపై వారు చర్చించారు. – భువనేశ్వర్

దారిమళ్లిన లారీ యజమానుల సంఘ నిధులు



మాట్లాడుతున్న కొండబాబు ,పక్కనే ఆదినారాయణ తదితరులు

రాయగడ: లారీ యజమానుల సంఘానికి చెందిన 60 కోట్ల రూపాయలకు పైగా నిధులు దారిమళ్లించి ఆ నిధులతో స్వంత వ్యాపార లావాదేవీలు కొనసాగించి కోట్ల రుపాయలకు పడగెత్తిన రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఆగడాలకు ఇక చెక్ పెట్టడం ఖాయమని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు యాల్ల కొండబాబు (వేంకటేశ్వరులు) అన్నారు. ఈ మేరకు లారీ యజమానుల సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన నెక్కంటి కార్యకలాపాలపై దుమ్మెత్తి పోశారు. నాలుగు దశాబ్దాలకు పైగా లారీ యజమానుల సంఘానికి ప్రాతినిథ్యం వహించిన నెక్కంటి ఈమేరకు సంఘానికి వచ్చే కోట్లాది రూపాయల ఆదాయాన్ని కాజేశారని ఆరోపించారు. గత రెండేళ్లగా తాను లారీ యజమానుల సంఘానికి అధ్యక్షుడిగా ఉండి సుమారు రెండు కోట్ల రూపాయల వరకు ఆదాయం సమకూర్చామని వివరించారు. ఈ నిధుల్లో భాగంగా సుమారు రు. 60 లక్షలు వెచ్చించి కార్యాలయం భవనం నిర్మించామని అన్నారు 40 ఏళ్ల సంఘానికి ప్రాతినిథ్యం వహించిన నెక్కంటి సంఘానికి వచ్చే నిధులను దారిమళ్లించి తమ సొంత వ్యాపారాలకు పెట్టుబడి పెట్టారని ఆరోపించారు. బినామీ పేర్లతో వ్యాపారాలను కొనసాగించి కోట్లాది రూపాయలకు పడగలెత్తిన నెక్కంటి కాజేసిన సంఘం నిధులు లారీ యజమానుల కష్టార్జితమేనని అన్నారు. సంఘం నిధులు,వాటి లెక్కలను చూపించని నెక్కంటిపై సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు కేసు నమోదు చేయకుండా పోలీస్ యంత్రాంగం నాన్చుతుందని ఆరోపించారు . కేసు నమోదు చేయాలంటే అందుకు నెక్కంటికి సంబంధించిన కొన్ని వివరాలు సమర్పిస్తేనే తాము కేసు రిజిష్టర్ చేస్తామని పోలీసులు తనకు నోటీసులు జారీ చేశారని కొండబాబు చెప్పారు.

ఆందోళన చేస్తాం..

లారీ యజమానుల సంఘం నిధులు దారిమళ్లింపునకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో నెక్కంటిపై ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు స్వీకరించి దానికి అనుగుణంగా దర్యాప్తు చేయకపోతే పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేయడం ఖాయమని కొండబాబు వెల్లడించారు. అనంతరం నెక్కంటికి సంబంధించిన వ్యాపార అక్రమ లావాదేవీలకు సంబంధించి విలేకర్ల సమావేశంలొ ప్రస్తావించారు. ఈ సమావేశంలొ లారీ యజమానుల సంఘానికి చెందిన కార్యకర్తలు ఆదినారాయణ, సంఘం కార్యదర్శి కడుపుకూట్ల జానకీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

బోటు బోల్తాపడి మత్స్యకారుడు మృతి

- గోవాలో ఘటన



కారి రాజులు(ఫైల్)

వజ్రపుకొత్తూరు: పల్లిపూరు పంచాయతీ హుకుంపేటకు చెందిన మత్స్యకారుడు కారి రాజులు(44) గోవాలో శుక్రవారం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజులు స్థానికంగా వేట సాగకపోవడంతో గోవాకు వలస వెళ్లాడు. అక్కడ శుక్రవారం సాయంత్రం 3.30 గంటల సమయంలో వేట సాగిస్తుండగా అలల ధాటికి బోటు బోల్తా పడింది. బోటు కిందే రాజులు చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయాడు. రాజులు తల్లిదండ్రులు బాల్యంలోనే చనిపోగా, భార్య నాగమ్మ, ఇద్దరు కుమార్తెలు స్వాతి, స్వప్న ఉన్నారు. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గోవా పోలీసులు పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని గ్రామానికి పంపిస్తారని స్థానికులు తెలిపారు.

అంబులెన్సులో ప్రసవం

మందస: పుత్తూరు గ్రామానికి చెందిన సవర కుమారికి రెండో కాన్పులో భాగంగా శుక్రవారం పురిటినొప్పులు మొదలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ చిన్నవాడు హటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో వీరగున్నమ్మపురం వద్ద నొప్పులు ఎక్కువ కావడంతో అక్కడే వాహనం ఆపి ప్రసవం చేయించడంతో పండింటి ఆడబిడ్డ జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.



తల్లీబిడ్డలతో అంబులెన్సు సిబ్బంది

అక్షర ఆంధ్ర విజయవంతం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అక్షరాస్యత శాతం పెంపునకు లక్ష్యంగా అమలు చేస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. దూరదర్శన్ (జూమ్) ద్వారా శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,12,071 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 66,000 మంది, గ్రామీణ ఉపాధి హామీ సంస్థ ద్వారా 36,000 మంది, పట్టణ అభివృద్ధి సంస్థ ద్వారా 9,000 మందికి వయోజన విద్య వలంటీర్లను 1:10 నిష్పత్తిలో ఎంపిక చేయాలని సూచించారు. వారు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, సంఘాల భవనాల్లో అక్షరాస్యత తరగతులు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లా స్థాయిలో జెడ్పీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి, జిల్లా ప్రణాళిక అధికారి, గ్రామీణాభివృద్ధి సంస్థ పథకాల సంచాలకులు, ఉపాధి హామీ సంస్థ పథకాల సంచాలకులు, పట్టణ అభివృద్ధి సంస్థ పథకాల సంచాలకులు, జిల్లా విద్యాధికారి, బాలల అభివృద్ధి సంస్థ అధికారి తదితరులు సమితి సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, పాఠశాల విద్యాధికారి, గ్రామీణాభివృద్ధి సంస్థ పథకాల సహాయకులు, ఉపాధి హామీ సంస్థ అభివృద్ధి అధికారి, బాలల అభివృద్ధి అధికారి, వయోజన విద్య పర్యవేక్షకులు సభ్యులుగా ఉంటారని వివరించారు. వయోజన విద్య ఉప సంచాలకుడు ముద్దాడ వెంకటరమణ సభ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తారని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, గ్రామీణాభివృద్ధి సంస్థ పథకాల సంచాలకుడు ఎం.కిరణ్ కుమార్, ఉపాధి హామీ పథకం సంచాలకుడు సుధాకర్‌రావు, పట్టణ అభివృద్ధి సంచాలకుడు ఎస్.వి.రమణ, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

7న ప్రతిభా పోటీలు

ఎచ్చెర్ల : శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 వసంతాలు పూర్తికావస్తున్న సందర్భంగా పీజీ, డిగ్రీ విద్యార్థులకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 7న ప్రత్యేక ప్రతిభా పోటీ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ శుక్రవారం తెలిపారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లా పాత్ర, జిల్లా ప్రగతిలో ముఖ్య ఘట్టాలు, జిల్లాలో జన్మించిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తదితర అంశాలపై విద్యార్థులు సమాధానాలు రాయాల్సి ఉంటుందన్నారు. వర్సిటీతో పాటు అనుబంధ కళాశాలల డిగ్రీ విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 83095 19615 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల : శ్రీకాకుళంలోని రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఏడుగురు సీఎస్ఈ విద్యార్థులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని గ్రిడ్డెక్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగాలు దక్కించుకున్నారు. నెలకు రూ. 20 వేలు స్టైపండ్‌తో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశాక సంవత్సరానికి రూ.8,00,00 ప్యాకేజీ అందిస్తారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, సీఎస్ఈ విభాగాధిపతి వై.రమేష్, అధ్యాపకులు అభినందిస్తూ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించారు.



విద్యార్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందిస్తున్న డైరెక్టర్ బాలాజీ

న్యాయం చేస్తారా.. చనిపోమంటారా?

- పురుగుమందు బాటిల్‌తో మహిళ నిరసన
- టెక్కలి పోలీస్‌స్టేషన్ ఎదుట కలకలం

టెక్కలి రూరల్: తనకు, పిల్లలకు న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ శుక్రవారం ఓ మహిళ పురుగుల మందుతో టెక్కలి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించింది. గతంలో తన భర్తతో తగాదా ఉంటే పోలీసులు కోర్టులో రాజీ చేయించి తమను బాగా చూసుకుంటాడని చెప్పారని, తర్వాత పూర్తిగా పట్టించుకోవడం మానేశాడని వాపోయింది. తనకు న్యాయం జరగకపోతే చావే శరణ్యమన్నారు. దీంతో పోలీసులు ఆమెకు నచ్చజెప్పి పురుగు మందు బాటిల్‌ను తీసుకుని స్టేషన్‌లోకి తీసుకువెళ్లి మాట్లాడారు. భర్తను పిలిపించి తనకు న్యాయం చేస్తామని ఎస్ఐ రాము నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించారు. కాగా, స్టేషన్ వద్ద మహిళ బైఠాయించిందన్న విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు స్టేషన్‌కు చేరుకుని వివరాలు సేకరించే క్రమంలో పోలీసులు అడ్డుతగిలారు. ఫొటోలు తీయడానికి వీలు లేదంటూ పంపించేశారు.



స్టేషన్ ముందు బైఠాయించిన మహిళకు నచ్చజెబుతున్న పోలీసులు

క్లుప్తంగా

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

• ఎస్ఎఫ్ఐ నిరాహార దీక్ష



నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పార్వతీపురం: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్.పావని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం గేటు వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక నిరాహార దీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ పూర్తి అయిన తరువాత పీజీ చేయాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, జిల్లా కేంద్రాల్లో పీజీ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని ఛిన్నాభిన్నం చేస్తోందని, కార్పొరేట్‌లను ప్రోత్సహించేలా విధానాలను రూపొందిస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఏఎన్ఎంలను నియమించకపోవడంతో విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా యన్నారు. ఈ దీక్షలకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు టి. అఖిల్, ఎం.సంధ్య, కె.డేవిడ్ ఎ.గంగారావు, ఎం.సురేష్, జి.సంజీవ్, సింహాచలం, రాజేష్, చంటి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌కు కీలక మార్గదర్శకాలు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు కళాశాలల నిర్వహణకు సంబంధించి కీలకమైన మార్గదర్శకాలను ఇంటర్మీడియట్ విద్య ఆర్‌జేడీ మజ్జి ఆదినారాయణ విడుదల చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాకు చెందిన 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో మార్గదర్శకాలపై వివరించారు. కార్యనిర్వహణ, విద్యాప్రమాణాల బలోపేతానికి సంబంధించిన సూచనలు విధిగా పాటించాలని కోరారు. కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి హాజరు తప్పనిసరిగా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ యాప్‌లో, భౌతిక హాజరు పుస్తకంలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రవేశాల దృష్ట్యా మొదటి సంవత్సరం విద్యార్థులను ఈ నెల 11వ తేదీ వరకు చేర్చుకోవాలని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థుల విజయశాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రతిభావంతుల కోసం పోటీ పరీక్ష శిక్షణ అందించాలన్న మార్గదర్శకాలు పాటించాలన్నారు. సమావేశంలో ఆర్ఐఓ ఎస్.తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

బాడంగి: కోరినంత బంగారం, కట్నం ఇవ్వలేదన్న కారణంగా నిశ్చితార్థం పూర్తయి పెళ్లివరకు వచ్చిన సంబంధం తప్పిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక పోలీసులు తెలిపిన కథనం ప్రకారం బాడంగి మండలంలోని గజరాయునివలస గ్రామానికి చెందిన కందుల చందనకు, బొబ్బిలికి చెందిన గ్రంధి సందీప్ గణేష్‌కు మేనెల 4వతేదీన నిశ్చితార్థం జరిగింది. అంతకుముందు పెళ్లిమాటల్లో 20 తులాల బంగారం, లక్షన్నర కట్నం ఆడపెళ్లివారు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా నిశ్చితార్థం రోజున 10తులాల బంగారం, రూ.50 వేల నగదు అడ్వాన్స్‌గా పెళ్లికుమారుడికి ఇచ్చారు. వారికి ఈనెల14వతేదీ పెళ్లి జరగాల్సి ఉండగా పెళ్లికొడుకు తండ్రి గ్రంధి దుర్గాప్రసాద్ అదనపుకట్నంగా మరోఐదుతులాల బంగారం కావాలని కోరడంతో ఆడపిల్లవారు ససేమిరా అన్నారు. దీంతో పెళ్లి ఆగిపోయింది. ఈ మేరకు పెళ్లికుమార్తె ఇచ్చిన ఫిర్యాదుతో పెళ్లికొడుకు, మామ దుర్గాప్రసాద్, అత్త జయలక్ష్మిల మీద వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. పెళ్లికొడుకు తండ్రి బొబ్బిలి ఆర్‌డీఓ కార్యాలయంలో హెచ్‌డీటీగా పనిచేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మేడపై నుంచి జారిపడి యువకుడి మృతి

సాలూరు రూరల్: పట్టణ పరిధిలోని బొడ్డవలస గ్రామానికి చెందిన మనోజ్ (25)తన ఇంటి మేడపై నుంచి జారి పడి మృతి చెందినట్లు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఇంటి మేడపై వడియాలు ఆరపెట్టేందుకు వెళ్లిన ఆయనకు గల శారీరక బలహీనత, అంగవైకల్యం కారణంగా ప్రమాదవశాత్తు జారిపడినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

772 లీటర్ల సారా ధ్వంసం



పట్టుబడిన సారాను ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన పోలీసు అధికారులు

పార్వతీపురం రూరల్: ఇటీవల పట్టుబడిన 17 సారా కేసుల్లో స్వాధీనం చేసుకున్న 772 లీటర్ల సారాను పట్టణ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఏఎస్పీ అంకితా సురాన ఆధ్వర్యంలో పట్టణ శివారులో శుక్రవారం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు సంతోష్‌కుమార్, పట్టణ సీఐ కె.మురళీధర్, ఎస్సై ఎం.గోవింద సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న సాగుతో ఆదర్శంగా..!

ఆయనొక రైతు. వ్యవసాయాన్ని నమ్ముకుని వారసత్వంగా వచ్చిన భూమిలో సరికొత్త పద్ధతిలో సాగుచేయడం ప్రారంభించారు. ఏ ఏడాదికి ఆ ఏడాది కొత్త విధానాలు అవలంబిస్తూ వ్యవసాయంలో పోటీపడుతున్నారు. ఉభయగోదావరి జిల్లాలోని రైతులకు దీటుగా ఇక్కడ వ్యవసాయం చేస్తూ దిగుబడులు సాధిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. నేరుగా ఏపీ సీడ్స్‌కే ప్రతి ఏడాది విత్తనాలు అందించే ఆ రైతు ఈ ఏడాది కూడా ఖరీఫ్‌సాగులో మరో కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ఖరీఫ్‌లో సాగుచేసే వరి పంటలో ఉభయగోదావరి జిల్లాల రైతులుఅవలంబిస్తున్న విధానాన్ని ఇక్కడ తన పంట పొలాల్లో ప్రారంభించారు. ఆయన మరెవరో కాదు రేగిడి మండలంలో ఉణుకూరు గ్రామానికి చెందిన గేదెల వెంకటేశ్వర రావు. – రేగిడి



లైన్‌సోయింగ్ పద్ధతిలో నాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు

• ఖరీఫ్‌లో కొత్త తరహా నాట్లు
• లైన్ సోయింగ్ విధానంతో వరినారు ఆదా
• ఎకరాకు 8 కిలోల విత్తనాల వరినారుతో ఉడుపు
• పశ్చిమబెంగాల్ కూలీలతో వరి ఉభాలు
• రైతు గేదెల వెంకటేశ్వర రావు కృషి



కొత్త విధానంలో వేసిన వరినారు



వినూత్నంగా వరి ఉభాలు

జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు ఉణుకూరు గ్రామంలో 50 ఎకరాలకు పైగా పంటపొలాలు ఉన్న రైతు. ఇంత ఆస్తి ఉన్నా తాను ఆ భూమిని ఎవరికీ కౌలుకు ఇవ్వలేదు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం కోసం అర్రులు చాచలేదు. తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా వచ్చిన భూమినే నమ్ముకున్నారు. వ్యవసాయాన్నే ఉద్యోగంగా మార్చుకుని ఊహతెలిసినప్పటి నుంచి వినూత్న పద్ధతుల్లో పంటలు సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రసాయన ఎరువుల మోతాదు తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఆది నుంచి ఆసక్తిగా వ్యవసాయం చేసే వెంకటేశ్వరరావుకు వ్యవసాయంలో వచ్చే కొత్త పద్ధతులు వేగంగా అందుకోవడం వెన్నతో పెట్టిన విద్య. ఇందులో భాగంగానే ఈ ఏడాది లైన్ సోయింగ్ విధానాన్ని అందుకుని, ఇక్కడ తన పంటపొలాల్లో ఈ పద్ధతిని ప్రారంభించారు.

8 కిలోల విత్తనాలతో ఎకరాలో సాగు

సాధారణంగా రైతులు ఎకరాసాగులో వరి ఉభాలకు 30 కిలోల వరకూ వరి విత్తనాలతో వరినారు తయారు చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఈ నారు సరిపోని పరిస్థితి ఉంటుంది. వరి ఉభాలు చేసిన సమయంలో ఈ ప్రాంతంలో కనీసం పదిమొక్కలను కలిపి ఒకేచోట వేస్తుంటారు. ఇలా కాకుండా ఒకచోట ఒక వరి నారును మాత్రమే ఉభాలు చేసి, ఒక వరి మొక్కకు మరో మొక్కకు మధ్య కనీసం పది అంగుళాల ఖాళీ ఉంచి ఉభాలు చేయడాన్ని లైన్‌సోయింగ్ విధానం అంటారు. ఈ విధానాన్ని ఉభయగోదావరి జిల్లాలోని రైతులు అవలంబిస్తున్నారు. ఈ విధానంతో ఆయా ప్రాంతాల్లో వరి పంట అధికంగా దిగుబడి రావడంతో పాటు చీడపీడలు తట్టుకుంటుంది. ఒక వరి మొలక కాస్తా పెరగగానే 30వరకూ పిలకలు వేసి పెద్ద దుబ్బుగా మారుతుంది. పెద్దగింజల కంకి హారం కట్టి, ఎకరాకు 40 బస్తాల వరకూ దిగుబడి వస్తుంది. ఈ విధానం నిమిత్తం వెంకటేశ్వర రావు ఎకరాకు 8కిలోలు చొప్పున విత్తనాలతో నారు పోసి పశ్చిమబెంగాల్ నుంచి కూలీలను తీసుకొచ్చి తనకున్న పొలాల్లో 40 ఎకరాల్లో ఈ విధానంలో వరినాట్లు వేయించారు. వారం రోజుల పాటు ఈ విధానంలో పంటపొలాల్లో వరినాట్లు వేయించారు. ప్రస్తుతం ఈ వరినాట్లు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ విధానాన్ని చూసిన మరో రైతు కూడా తనకున్న పది ఎకరాల్లో వరిసాగుచేస్తున్నారు.

దిగుబడి సాధనలో దిట్ట

గేదెల వెంకటేశ్వరరావుకు జిల్లాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో కూడా పేరుంది. వరి పంటలో స్థానిక రకాలతో పాటు ఇతర ప్రాంతాల్లో సాగుచేసే సన్నాలు, మసూరి పంటలను కూడా సాగుచేస్తుంటారు. ఆయన వద్ద ఉభయగోదావరి జిల్లాలకు చెందిన రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. వరితో పాటు మిరప, మొక్కజొన్న పంటల సాగులో కూడా మంచి దిగుబడి సాధించే సత్తా వెంకటేశ్వరరావుకు ఉంది. వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సైతం ఆయన సాగుచేస్తున్న పంటను పరిశీలించేందుకు వస్తుంటారు. ఆయన సాగుచేస్తున్న వరిపంటలో నాణ్యత ఉండడంతో గత 20 సంవత్సరాలుగా ఏపీ సీడ్స్‌కు విత్తనాలు అందిస్తున్నారు.

ఇష్టంతోనే..



వ్యవసాయం కష్టంతో కాకుండా ఇష్టంతో చేయాలి. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. విత్తనాల దగ్గర నుంచి ఎరువులు వరకూ ప్రతి పెట్టుబడికి ఇతరులపై ఆధార పడకూడదు. రైతు సొంతంగా విత్తనాలు తయారు చేసుకునే స్థితికి రావాలి. రసాయన ఎరువులు తగ్గించి సాగుచేసే విధానంవైపు రైతులు దృష్టిసారించాలి. మిగిలిన ప్రాంతాల్లోని రైతులతో పోటీపడే ఆలోచన రావాలి. అప్పుడే వ్యవసాయంలో లాభాలు కనిపిస్తాయి. ఈ ఏడాది లైన్‌సోయింగ్ విధానంలో వరినాట్లు వేశాం. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది.

– గేదెల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు, ఉణుకూరు

దొంగతనానికి దారితీసిన జల్సాలు

• చోరీకేసును ఛేదించిన పోలీసులు



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు, వెనుక ముసుగులో నిందితులు

రాజాం సిటీ: జల్సాలకు అలవాటుపడి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ పాఠశాలలో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్ స్నేహితుల సహాయంతో దొంగతనానికి పాల్పడ్డాడు. జల్సాలు, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు పాల్పడిన ఓ యువకుడు తనకు గతంలో పరిచయమున్న స్నేహితులను ఆశ్రయించి సొంత గ్రామంలో ఏకంగా 18 తులాల బంగారాన్ని చోరీ చేయడంలో సూత్రధారిగా నిలిచాడు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడుకాగా మరో స్నేహితుడు ఉన్నాడు. ఈ ఘటనకు సంబంధించి రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వంగర మండలం బాగెంపేట గ్రామంలో గత నెల 24న పసుమర్తి శంకరరావు ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి 25న కేసు నమోదుచేసిన వంగర పోలీసులు ఈ దొంగతనానికి సూత్రధారిగా అదే గ్రామానికి చెదిన రెడ్డి గోపాలకృష్ణను గుర్తించి ఆరా తీశారు. ఆయన ఓ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌తోపాటు జల్సాలకు అలవాటుపడి ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. ఈ ఇబ్బందుల నుంచి ఎలాగైనా బయటపడాలని నిర్ణయించి గతంలో వాలీబాల్ క్రీడలో పరిచయమైన పాలకొండ మండలం యరకారాయపురం గ్రామానికి చెందిన శ్రీరామ్ బాలరాజు, టీకే రాజపురం గ్రామానికి చెందిన జాడ దుర్గారావులను ఆశ్రయించాడు. గ్రామానికి చెందిన పసుమర్తి శంకరరావు కుటుంబంతో సహా ఇంటికి తాళంవేసి హైదరాబాద్ వెళ్లారని, వారి ఇంట్లో బంగారం సులభంగా దొంగిలించవచ్చునని వారికి తెలియజేశాడు.

16 తులాలు రికవరీ

ఇదే అదునుగా వారు ముగ్గురూ దొంగతనానికి పాల్పడ్డారు. దొంగిలించిన బంగారాన్ని అమ్మకానికి తీసుకువెళ్తున్న నిందితులను బూరాడ జంక్షన్ వద్ద శుక్రవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి 18 తులాల బంగారానికి గాను 16 తులాలు రికవరీ చేయగా మిగిలిన రెండు తులాలు బాలరాజు పార్వతీపురంలోని సీఎస్‌బీ బ్యాంకులో తాకట్టుపెట్టాడని, అదికూడా త్వరలో రికవరీ చేస్తామని వెల్లడించారు. సీఐ కె.అశోక్‌కుమార్, వంగర ఎస్సై షేక్‌శంకర్ ఉన్నారు.

సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా సురేష్



మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో ఉపద్రష్ట సురేష్

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వై ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగంలో వివిధ హోదాల్లో పలువురిని నియమిస్తూ శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు పార్వతీపురం నియోజకవర్గంలోని సీతానగరం మండలానికి చెందిన ఉపద్రష్ట సురేష్‌ను సోషల్‌మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనను సూచించిన స్థానిక మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు సురేష్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ స్పందిస్తున్న తీరును వివరిస్తూ..సోషల్ మీడియా వేదికగా కూటమి ప్రభుత్వాన్ని ఎండగడతామని సురేష్ అన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

సంతకవిటి: మండలంలోని పుల్లిట గ్రామానికి చెందిన జామి పట్టాభి(38) పాముకాటుకు గురై శుక్రవారం మృతి చెందాడు. ఆయన ఎప్పటిలాగానే తమ పొలంలో కూరగాయలు ఏరేందుకు సాయంత్రం వెళ్లగా పొలంలో పాము కాటు వేయడంతో కుటుంబసభ్యులకు తెలపగా రాజాం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య భవానితో పాటు 9వ తరగతి చదువుతున్న షణ్ముఖరావు, 4వ తరగతి చదువుతున్న నవీన్‌లు ఉన్నారు. దీనిపై పోలీసులను సంప్రదించగా ఎటువంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

ఆస్తిపై హక్కును రద్దు ఎలా చేస్తారు

• సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కన్నీరు పెట్టుకున్న బాధితులు



ఆస్తిపై హక్కు దస్తావేజు రద్దు చేశారని కన్నీరు పెడుతున్న సుమతి, అప్పారావు దంపతులు

పాలకొండ రూరల్: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పొందుపర్చిన వెసులుబాటులను ఆసరాగా చేసుకుని తనకు దఖలుపడిన ఆస్తిపై ఉన్న హక్కును తన ప్రమేయం లేకుండా ఎలా రద్దు చేస్తారని ఓ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. రిజిస్ట్రేషన్ సమయంలో ఎటువంటి నిబంధనలు ఉండవా? అడ్డగోలుగా వ్యవహరిస్తారా? అంటూ అధికారులను సూటిగా ప్రశ్నించడంతో పాటు తనకు అన్యాయం చేయవద్దంటూ కన్నీరు పెట్టుకుంది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..అనకాపల్లి జిల్లా, అదే మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కట్టుమూరి సుమతి, అప్పారావు దంపతులు శుక్రవారం పాలకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్నారు. నేరుగా రిజిస్ట్రార్ శ్రీరామ్మూర్తిని కలిసి తమ ఆవేదన వెళ్లగక్కారు. ఈ సందర్భంగా బాధితురాలు సుమతి మాట్లాడుతూ తన తల్లి ఓదిరి జయమేరి పసుపు కుంకుమ నిమిత్తం విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో సర్వే నంబర్ 63/3 (డాబాగార్డెన్స్-కప్పరాడ (గ్రామం) వద్ద డోర్ నంబర్ 57-28-16/7 అసెస్మెంట్ నంబర్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రెసిడెన్షియల్ ఫ్లాట్‌ను గిఫ్ట్ రూపంలో అందించారన్నారు. ఇందుకు సంబంధించి 2021లో ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నంబర్ 2757/2021 రిజిస్ట్రేషన్ చేసినట్లు వివరించారు. ఇటీవల తన ప్రమేయం లేకుండా సదరు గిఫ్ట్ దస్తావేజును పాలకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2025 జూన్ 25వ తేదీన 'ఎనీవేర్' పద్ధతిలో వేరొకరు రద్దు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. తన సోదరుడు ఓదిరి సతీష్, ఆయన భార్య విజేత ఈ చర్యలకు పాల్పడినట్లు వాపోయారు.

నోటీసులు ఇవ్వకుండా చేశారు

రిజిస్ట్రేషన్ సమయంలో పాలకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు తనకు ఎటువంటి నోటీసులు, సమచారం ఇవ్వకుండా తన ఆస్తిపై హక్కును రద్దు రిజిస్ట్రేషన్ చేయించడం అన్యాయమని వాపోయారు. రిజిస్ట్రేషన్ విధానంలో గల ఎనీవేర్ పద్ధతిని అడ్డుపెట్టుకుని అధికారం, పలుకుబడి, నగదు చెల్లించి నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రక్రియకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోయారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని బాధిత దంపతులు సుమతి, అప్పారావు కోరారు. ఫిర్యాదును పరిశీలించిన పాలకొండ సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ తన హయాంలో ఈ దస్తావేజు రద్దు జరగలేదన్నారు. వాస్తవానికి సుమతికి తన తల్లి ద్వారా దఖలు పడిన గిఫ్ట్ రిజిస్ట్రేషన్ పత్రాలు రద్దు చేయాలంటే కచ్చితంగా ఆమెకు ముందుగా నోటీసులు ఇవ్వాలని, వారి సమక్షంలో రద్దు దస్తావేజులు రూపొందించాల్సి ఉంటుందన్నారు. బాధితులు అందించిన ఫిర్యాదును ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

• ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ
• సాక్షి కథనానికి స్పందన



అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం రూరల్: గిరిజన ప్రాంతాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించినా..ప్రత్యేక శ్రద్ధ చూపించకపోయినా ఉపేక్షించేది లేదని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ సంబంధిత అధికారులకు తేల్చి చెప్పారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల బాగోగులు చూడాల్సిన బాధ్యత సంక్షేమ, వైద్యాధికారులపై ఉందని హెచ్చరించారు. గురువారం సాక్షి దినపత్రికలో ''ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అనారోగ్యం'' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో శుక్రవారం ఈ మేరకు పీఓ డోకిశీల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యానికి గురైన విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు, స్థానిక వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు కావాల్సిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, విద్యార్థులను ఎప్పటికప్పుడు పరిశీలించి అనుమానంగా ఉంటే రక్తపరీక్షలు నిర్వహించి వ్యాధులను నిర్ధారించాలని స్పష్టం చేశారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండా దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ పర్యటనలో గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి, మరి కొంతమంది అధికారులు పాల్గొన్నారు.

ఫలించిన రన్ మిషన్ కష్టం..

• పోలీస్ ఉద్యోగాలకు 14 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో రన్ మిషన్ వ్యవస్థాపకుడు హేమంత్

చీపురుపల్లి: రక్షణ దళంలో ఒకటైన ఎయిర్‌ఫోర్స్‌లో ఆయనొక ఉద్యోగి. అయితే అందరి ఉద్యోగుల్లాగా తన పని తాను చేసుకుంటూ కుటుంబం బాగోగులు చూసుకుంటూ ఆయన ఉండలేదు. తన లాగానే మరెంతో మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత పోలీస్, రక్షణ దళంలో చేరాలని అందుకు అవసరమైన సహకారాన్ని అందజేయాలని తపించారు. అందులో భాగంగానే పుట్టుకొచ్చింది రన్ మిషన్. ఆ రన్ మిషన్ ఎంతో మంది యువత ఉద్యోగాలు సాధనకు వేదికైంది. తాజాగా విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాల్లో రన్ మిషన్ నేతృత్వంలో శిక్షణ పొందిన 14 మందికి ఉద్యోగాలు వచ్చాయి. దీంతో వారంతా రన్ మిషన్ పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి చెందిన ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ రన్ మిషన్ అనే సంస్థను స్థాపించారు. ఆ సంస్థ ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతీ, యువకులకు పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా శిక్షణ తీసుకున్న యువతలో తాజాగా విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో 14 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సివిల్ విభాగంలో ఐదుగురు, ఏపీఎస్‌పీ విభాగంలో 9 మంది ఉద్యోగాలు సాధించిన వారిలో ఉన్నారు. రన్‌మిషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం ద్వారా ఎంతో మందికి ఉద్యోగావకాశాలు లభిస్తుండడంతో వ్యవస్థాపకుడు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2న సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్

• ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నీతి ఆయోగ్ కింద ఆశావహ జిల్లాల్లో ఒకటిగా ఉందన్నారు. ఇందులో భాగంగా విద్య, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధి, మౌలిక సదుపాయాలు వంటి 12 కీలక సామాజిక రంగ సూచికలలో ఆయా రంగాలలో పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఆశావహ జిల్లాలు, బ్లాక్‌లలో సూచికలలో శతశాతం సంతృప్తిని సాధించే లక్ష్యంతో నీతి ఆయోగ్ 'సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్'ను ప్రారంభించిందన్నారు. ఈ మేరకు నీతి ఆయోగ్ సూచనల అనుగుణంగా శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేటాయించిన పనితీరు, సూచికలలో సంతృప్తినిచ్చిన జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ఫ్రంట్‌లైన్ కార్మికులకు సన్మానం జరుగుతుందని పేర్కొన్నారు.

జర్మనీభాషలో ఉచిత శిక్షణకు ఆహ్వానం

విజయనగరం టౌన్: జర్మనీలో నర్స్ ఉద్యోగాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీ భాషపై ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకురాలు అన్నపూర్ణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన మహిళలు ఎవరైనా నర్సింగ్, జీఎన్ఎమ్ పట్టభద్రులకు జర్మనీ భాషలో బి2 స్థాయిలో 8 నుంచి 10 నెలల పాటు ఉచిత శిక్షణ, వసతితో కూడిన సదుపాయాలు కలిగిన కేంద్రాలను విశాఖ, గుంటూరు, తిరుపతిలో ఏర్పాటుచేసి, వారికి జర్మనీ దేశంలో ఉపాధి అవకాశం కల్పించే ఉద్దేశంతో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రవేశానికి నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణకు సంబంధించి మహిళలకు 35 ఏళ్ల వయసు మించకుండా బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎమ్ నర్సింగ్ పూర్తిచేసి క్లినికల్ అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల మహిళలు ఆగస్టు 7వ తేదీ లోపు అన్ని సర్టిఫికెట్లతో వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తు పత్రాలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 98488 71436 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సామూహిక కుంకమ పూజలు చేస్తున్న మహిళలు



• శ్రావణశోభ

శ్రావణ మాసం రెండో శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ ఆలయం భక్తులతో నిండిపోయింది. ఆలయ ఆవరణలో సామూహిక కుంకుమ పూజలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో కోటదుర్గమ్మను అలంకరించి, పూజలు జరిపించి నైవేద్యాలు సమర్పించారు. కొండపురం గ్రామ సమీపంలోని గాయత్రి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. – పాలకొండ



ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మవారు